ప్రజాశక్తి

ఆదివారం 1 సెప్టెంబరు 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా





అతలాకుతలం

- విజయవాడలో కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతి
- జనజీవనం అస్తవ్యస్తం
- నలుగురుకి తీవ్ర గాయాలు
- రెండు ఇళ్లు ధ్వంసం
- చెరువులను తలపించిన రోడ్లు
- వాగులో కొట్టుకుపోయిన ద్విచక్ర వాహనదారుడు
- నీట మునిగిన పొలాలు





చెరువును తలపిస్తున్న స్టేడియం





ప్రజాశక్తి - యంత్రాంగం

భారీ వర్షాలతో ఉమ్మడి కృష్ణాజిల్లా అతలాకుతలమైంది. కుండపోత వర్షాలు బీభత్సం సృష్టించాయి. దీంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. పంట పొలాలు నీట మునిగాయి. రోడ్లు జలమయం అయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వేల ఇళ్లు నీట మునిగాయి, రోడ్లపై నీరు నిలిచిపోయి, రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ప్రజలు ఇళ్లల్లో ఉండలేక, బయటకు రాలేక నానా అవస్థలు పడుతున్నారు. కనీసం వంట చేసుకునే అవకాశం లేదు. మరుగుదొడ్లకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. పలుచోట్ల విద్యుత్ నిలిచిపోయింది, ఇళ్లల్లోని సామాగ్రి మొత్తం దెబ్బతిన్నాయి. భారీ ఎత్తున ఆస్తి నష్టం జరిగింది. ప్రజలకు జీవనోపాధి లేకుండా పోయింది. ముఖ్యంగా విజయవాడ నగరం గత 20 ఏళ్లలో ఎన్నడూలేని విధంగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఎటువైపు చూసినా మొకాళ్లలోని నీళ్లు రోడ్లపై నిలిచిపోయాయి. భవనాల పైనుండి చూస్తే నగరం నీటిలో తెలియాడుతున్నట్లుగా కనిపించింది. విజయవాడ మొగల్రాజపురం సున్నపుబట్టీల సెంటరు ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటనలో మరో నలుగురు గాయపడ్డారు. రెండు గృహాలు ధంసమయ్యాయి. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీళ్లు చేరాయి. దుర్గగుడి ఘాట్ రోడ్డుపై కొండచరియలు విరిగిపడ్డాయి. ప్రోటోకాల్ కార్యాలయంపై కొండరాళ్లు పడ్డాయి. ముందస్తుగా ఘాట్ రోడ్డును మూసివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అలాగే ఎన్‌టిఆర్ జిల్లా చందర్లపాడులో ఓ ద్విచక్ర వాహనదారుడు వాగులో కొట్టుకుపోయాడు. విజయవాడ పండింట్ నెహ్రూ బస్టాండ్ జలదిగ్బంధంలో చిక్కుకుంది. బస్టాండ్‌లోని ఎరైవల్ బ్లాక్‌పైకి రెండడుగుల మేర వర్షం నీరు చేరింది. బస్టాండ్ ప్రాంతంలోని రైల్వే బ్రిడ్జి వద్ద భారీస్థాయిలో చేరిన నీటిలో ఐదారు బస్సులు చిక్కుకుపోయాయి. దీంతో బస్సుల్లోని ప్రయాణీకుల తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ కూడా నిలిచిపోయింది. పలు ఆర్టీసి సర్వీసులను రద్దు చేశారు. విజయవాడ నుంచి రూరల్ ప్రాంతాలలకు వెళ్లాల్సిన 13 రూట్లలో 8,520 కిలోమీటర్ల నడవాల్సిన 68 సర్వీసులను రద్దు చేసినట్లు ఆర్‌టిసి అధికారులు తెలిపారు. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో 20 రైళ్లు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో వీటిని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా గన్నవరం విమానాశ్రయంలో విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముంబాయి, హైదరాబాద్, ఢిల్లీ, విశాఖపట్నం, తిరుపతి, చెన్నై ప్రాంతాల నుంచి నడుస్తున్న విమాన సర్వీసులు 15 నిమిషాల నుండి అరగంట వరకు ఆలస్యంగా నడుస్తున్నాయి. వర్షాల వల్ల ఎటువంటి విమాన సర్వీసులు రద్దు చేయలేదని అధికారులు తెలిపారు.

మృతులు

విజయవాడ మొగల్రాజపురంలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో నవుడు మేఘన (25), బోలెం లక్ష్మీ(48), లాలు (37), జంపాన అన్నపూర్ణ (65), మరో యువకుడు కామరి సంతోష్ (18) మరణించారు. ఇప్పటికే నలుగురు మృతదేహాలను వెలికితీశారు. చీకటి పడటంతో ఆదివారం కూడా సహాయక చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. గాయపడిన మరో నలుగురు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఐదుగురికి చికిత్స

కొండచరియలు విరిగిపడిన ఘటనలో గాయపడిన వారి నలుగురికి విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేష్ తెలిపారు. నలుగురు సాదారణ గాయలతో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో అలజంగి శాంతి, అలజంగి స్వామి, నాడు సత్యనారాయణ, నాడునాగమణి ఉన్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలింపు

వర్షాల తీవ్రత ఇంకా రెండు రోజులు కొనగాదడంతో సున్నపుబట్టీలు పరిసర ప్రాంతాలలోని కొండ ప్రాంత వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సుమారు 100 మందికిపైగా కొండ ప్రాంతాలలో నివాసం ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిలంచారు. వారికి పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నామనపి కలెక్టర్ సృజన తెలియచేశారు.




కొండచరియలు విరిగిన పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, కలెక్టర్ సృజన

(వర్షం బీభత్సం వార్తలు లోపలి పేజీలో)

ముంపు ప్రాంతాల్లో సిపిఎం నేతల పర్యటన

ముంపు బారిన పడిన విజయవాడ నగర ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారీ వర్షాలతో విజయవాడ అజిత్ సింగ్ నగర్, పాయకాపురం ప్రాంతంలో నీట మునిగిన ఇళ్లను, మొగల్రాజపురంలో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని శనివారం ఆయన పరిశీలించారు. బాధితులకు భోజన సౌకర్యాలు కల్పించాలని కోరారు. పల్లపు ప్రాంతాల్లో నిలిచిన నీటిని మోటార్లతో తోడించాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుదల చేయాలని కోరారు. నీట మునిగిన కాలనీలు, ఇళ్లను బాబూరావు పరిశీలించారు. ఈ పర్యటనలో సిపిఎం నేతలు కే.దుర్గారావు, సిహెచ్. శ్రీనివాస్, బ్రహ్మం, అమ్ములు పాల్గొన్నారు.



కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు సిహెచ్.బాబూరావు



ఏనుగుగడ్డ వాగుకు భారీగా వరద

- పొంగిన పరిటాల చెరువు
- జాతీయ రహదారిపై నీరు
- బ్రిక్స్ కంపెనీని ముంచెత్తిన వరద.
- వరద ముంపులో చిక్కుకున్న 54 మంది కార్మికులు
- ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సహాయంతో కార్మికుల తరలింపు



న్యూకాన్ బ్రిక్స్ కంపెనీ లో వరదలో చిక్కుకున్న కార్మికులనూ సురక్షిత ప్రాంతానికి తరలించిన అధికారులు

ప్రజాశక్తి - కంచికచర్ల : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తెలంగాణ లోని ఖమ్మం జిల్లా జమలాపురం నుండి వచ్చే ఏనుగుగడ్డ వాగుకు భారీగా వరద చేరింది. ఈ వాగు నీరు పరిటాల చెరువు నిండి జాతీయ రహదారి మీదగా మండలంలోని కొత్తపేట వద్ద కష్ణానదిలో కలుస్తుంది. వరద ప్రవాహినికి శనివారం రాత్రి చెరువు నిండి పరిటాట వద్ద చెరువు కట్ట పొంగి వరద విజయవాడ రహదారిపై ప్రవహించింది. పరిటాల మసీదు వద్ద గ్రామంలోకి వరద చేరింది. అలాగే చెరువు అలుగు పొంగి వరద పరిటాల సమీపంలో జాతీయ రహదారి పక్కన గల న్యాకాన్ బ్రిక్స్ కంపెనీలోకి వరద చేరింది. ఆ కంపెనీలో ఇతర ప్రాంతాలకు చెందిన 54 మంది కార్మికుల చిక్కుకున్నారు. వెషయం తెలిసిన వెంటనే తహశీల్దార్ జాహ్నవి, డిటి నాగులుమీరా, సిఐ చవాన్, ఎన్ డి ఆర్ ఎఫ్ సిబ్బందిని పిలిపించారు. బోట్లో 54 మంది కార్మికులను రక్షించి పరిటాల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు తరలించారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించాలి : మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : లోతట్టు ప్రాంతాల్లోని ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మంత్రి కొల్లు రవీంద్ర కష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్‌లను ఆదేశించారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో మంత్రి కొల్లు రవీంద్ర శనివారం మంత్రి నివాసం నుండి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. నీళ్లు నిలిచిపోయిన ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలాన్నారు. కాలువల్లో నీరు పారేలా అడ్డంకులు తొలగించాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. అలాగే మ్యాన్ హోల్స్, విద్యుత్ స్తంభాల విషయంలో అప్రమత్తం చేయలన్నారు. విజయవాడలో పలు ప్రాంతాలు నీట మునగడంపై ఆరా తీశారు. వర్ష ప్రభావం తగ్గే వరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజా ప్రతినిధులంతా అందుబాటులోనే ఉన్నారని వారితో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటన

తక్షణ సహాయ చర్యలకు కాల్ సెంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి - విజయవాడ : కుండపోతగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న అతి భారీ వర్షంతో జలమయమైన ప్రాంతాలలో శనివారం జిల్లా కలెక్టర్ డా. జి.సజన పర్యటించారు. తీవ్ర వర్షాల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దష్టిలో పెట్టుకుని కాల్ సెంటర్ ఏర్పాటు చేసి సహాయక చర్యలు చేపట్టేలా పలు సూచనలు చేశారు. మొగల్రాజపురం సున్నపు బట్టీలు సెంటర్ ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడిన ప్రదేశాన్ని పరిశీలించి మతి చెందిన వారి కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు పరిశీలించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం తెల్లవారుజామున ప్రారంభమైన జిల్లా కలెక్టర్ పర్యటన శనివారం సాయంత్రం వరకు కొనసాగింది. మునిగిపోయిన రోడ్లను నీరు నిలిచిన పల్లపు ప్రాంతాలను పరిశీలించి ఆయా ప్రాంతాల్లో ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఘాట్ రోడ్లో ముందస్తు జాగ్రత్తలకు ఆదేశం

కనకదుర్గ ఆలయానికి వెళ్లే ఘాట్ రోడ్లో కొండ రాళ్లు జారిపడి, పాక్షికంగా దెబ్బతిన్న ఘాట్ రోడ్ పరిసరాలను కలెక్టర్ డా. జి సజన, ఆలయ ఇఓ కెఎస్ రామరావు పరిశీలించారు.

మృతుల కుటుంబాలకు మంత్రి నారాయణ రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం

మొగల్రాజపురం సున్నం బట్టి సెంటర్ ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడిన సంఘటనలో మతుల కుటుంబ సభ్యులకు నగరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ తరపున ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం చెక్కులను మంత్రి పి.నారాయణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, నగర పాలక కమిషనర్ ధ్యాన చంద్ర, మతి చెందిన మేఘన, లక్ష్మి, అన్నపూర్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మునిగిన పంపింగ్ స్కీమ్

ముత్యాలంపాడులో ఎన్నడూ లేనివిధంగా డ్రైనేజీ పంపింగ్ స్టేషన్ భారీ వర్షానికి మునిగిపోయింది. దీంతో ముత్యాలంపాడు, శ్రీనగర్ కాలనీ, లక్ష్మీ నగర్, అంబేద్కర్ కాలనీ, టీచర్స్ కాలనీల్లో డ్రైనేజీ, వర్షపు నీటితో నిండిపోయాయి. పంపింగ్‌కు వాడే మోటార్లు కూడా పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో ఆయిల్ ఇంజన్లలో ఉదయం నుండి సాయంత్రం వరకు నీటిని తోడారు. సాయంత్రానికి డ్రైనేజీ సంపులోకి మరో మోటరును మున్సిపల్ సిబ్బంది ఏర్పాటు చేశారు. డిఇ రామకష్ణ, ఎఇలు శ్రీనివాసన్, నర్మదా, ప్రభాకర్ రెడ్డి, రామారావు పర్యవేక్షణలో పనులు జరిగాయి.

సిపిఎం నేతల పరామర్శ

విజయవాడ : మొగల్రాజపురం సిఎస్ఐ పాఠశాల సమీపంలో కొండచరియలు విరిగి పడటంతో ఇంటి గోడ ధ్వంసమైంది. భాధిత కుటుంబాన్ని సిపిఎం తూర్పు నగర కార్యదర్శివర్గ సభ్యులు పి.కష్ణ, జి.క్రాంతి కుమార్, నగర కమిటీ సభ్యులు మరహరి తదితరులు పరామర్శించారు.

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి కొల్లు



ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర ప్రభుత్వం పేదల పట్ల ఎంతో బాధ్యతగా చిత్తశుద్ధితో పనిచేస్తుందని, అర్హులైన పేదలందరికీ పింఛను అందించి ఆదుకోవడమే లక్ష్యంగా ఉన్నామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు, ఆబ్కారి శాఖ మంత్రి కొలు రవీంద్ర అన్నారు. శనివారం మచిలీపట్నం 20వ వార్డు గిలకలదిండిలో ఆయన ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తొలుత మంత్రి గిలకలదిండిలో మంచానికి పక్షవాతంతో మంచానికే పరిమితమైన లంకే పోతురాజును పరామర్శించారు. రూ.15 వేల పింఛను అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటలు

పొంగి ప్రవహిస్తున్న కాల్వలు, డ్రైన్లు - స్తంభించిన జనజీవనం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కృష్ణా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి శనివారం సాయంత్రం ఏడు గంటల వరకు జిల్లా వ్యాప్తంగా సగటున 211.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలకు రహదారులు , కాలువలు, డ్రయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు, కాలనీలు నీట మునిగాయి. జనజీవనం స్తంభించింది. తొమ్మిది మండలాల్లో 4,514 హెక్టార్లలోని పంటలు నీట మునిగాయని వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా వేసింది. వీలుపడక పోవడంతో ముంపు వివరాలను పూర్తి స్థాయిలో సేకరించలేదు. పంటల ముంపు మరింత పెరిగే అవకాశం ఉంది. బంటుమిల్లి, కృత్తివెన్ను, ఘంటసాల, మొవ్వ, మోపిదేవి, కోడూరు తదితర మండలాల్లోనూ పలు గ్రామాల్లో వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. వర్షంతో పాటు ఈదురుగాలులు వీయడంతో పెనమ లూరులో పశువులపాక కూలి నాలుగు గొర్రెలు మృతి చెందాయి. బందరు రూరల్ మండలం ఎస్ఎన్ గొల్లపాలెంలో ప్రహరీకూలి పోయింది. యనమలకుదురులో రేకుల షెడ్ కూలిపోయింది. కృష్ణా ఇస్ట్రన్ డెల్టా బ్యాంక్ కెనాల్ పొంగి మోపిదేవి మండలం వార్పుపైకి నీరు చేరింది.

తొమ్మిది మండలాల్లో పంట ముంపు అంచనా

మండలాలు	విస్తీర్ణం (హెక్టార్లలో)
గన్నవరం	480
బాపులపాడు	850
బంటుమిల్లి	20
ఉయ్యూరు	153
పమిడిముక్కల	1441
పెనమలూరు	450
ఉంగుటూరు	800
కంకిపాడు	200
మొత్తం	4,514

జలమయం

బందరులో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. రోడ్లపై మూడు నుంచి నాలుగు అడుగులు మేర నీరు నిలిచింది. కోనేరు సెంటర్, రేవతి సెంటర్, బస్టాండ్ సెంటర్, జిల్లా కోర్టు సెంటర్, లక్ష్మీ టాకీస్ సెంటర్ వరకు రోడ్డుపై ద్విచక్ర వాహనాలు కార్లలో ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని చోట్ల వాహనాల ఇంజన్లలోకి నీరు చేరి నిలిచిపోయాయి. బస్టాండ్‌లోకి నడుంలోతు నీరు చేరింది. సుందరయ్య నగర్, డ్రైవర్స్ కాలనీ, గుమస్తాల కాలనీలో , పికెఎం నగర్, టెంపుల్ కాలనీలు, వడ్డీ రంగరావు కాలనీ, టైలర్స్ కాలనీలు నీటిలో చిక్కుకున్నాయి. కాలనీల ప్రజలు ఇళ్ల నుంచి వెలుపలకు వచ్చే అవకాశం లేకుండా నీటిలో చిక్కుకున్నారు. బందరు నగరపాలక సంస్థతోపాటు గుడివాడ, పెడన మున్సిపాల్టీల్లో పలు కాలనీలు, పలు గ్రామాలు నీటిలో చిక్కుకున్నాయి.

స్తంభించిన జనజీవనం

ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండంతో జనజీనవం పూర్తిగా స్తంభించింది. ఇళ్ల నుంచి వెలుపలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలోనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. వ్యాపార సంస్థలు, ప్రచారీ దుకాణాలు, హెటల్స్, హాకర్స్ వ్యాపారాలను కొనసాగించలేక పోయారు. అత్యధిక దుకాణాలు మూతపడే దర్శనమిచ్చాయి.

వర్షపాతం వివరాలు ఇలా

మండలం	ఉదయం 8.30 వరకు మిల్లీమీటర్లు	రాత్రి 7 వరకు మిల్లీమీటర్లు
బంటుమిల్లి	220.8	94.0
కంకిపాడు	170.2	99.4
గుడివాడ	169.4	59.4
పెనమలూరు	163.8	139.2
పెదపారుపూడి	156.2	61.4
వుయ్యూరు	154.2	84.4
పామర్రు	148.6	99.6
ఉంగుటూరు	143.6	74.0
నందివాడ	140.2	64.4
పమిడిముక్కల	137.2	77.4
గుడ్లవల్లేరు	129.8	148.0
గన్నవరం	128.4	61.0
మచిలీపట్నం	121.6	53.2
తోట్లవల్లూరు	118.6	84.2
మొవ్వ	117.0	98.2
గూడూరు	116.2	86.2
పెడన	108.6	152.6
బాపులపాడు	98.2	56.2
కోడూరు	85.2	53.2
ఘంటసాల	81.5	105.0
కృత్తివెన్ను	80.0	93.4
నాగాయలంక	78.8	87.0
చల్లపల్లి	67.4	87.6
అవనిగడ్డ	62.8	108.2
మోపిదేవి	56.4	111.0
మొత్తం	3034.0	2238.2
సగటు	122.2	సగటు 89.5

ఎన్‌టిఆర్ జిల్లాలో రికార్డు స్థాయిలో వర్షపాతం

వీర్లుపాడు మండలంలో అత్యధికంగా 210.0 ఎంఎం

అత్యల్పం తిరువూరులో 43.8 మిల్లీమీటర్లు

ప్రజాశక్తి-విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లాలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు అయింది. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 5 గంటలలోపు జిల్లాలో సరాసరిన వర్షపాతం 111.2 మిల్లీమీటర్లు, నమోదు కాగా, జిల్లా వ్యాప్తంగా 2,224.6 ఎంఎం వర్షపాతం నమోదైంది. అలాగే శుక్రవారం నుంచి శనివారం ఉదయం 8.30 గంటలలోపు జిల్లాలో సరాసరిన వర్షపాతం 131.98 ఎంఎం నమోదు కాగా, 2,639.6 ఎంఎం వర్షపాతం నమోదైంది. గత 20 ఏళ్లలో ఇంత భారీ స్థాయిలో వర్షాలు కురవలేదని అధికారిక రికార్డులు విధితం చేస్తున్నాయి. మిల్లీమీటర్లలో మండలాల వారీగా కురిసిన వర్షపాతం వివరాలు. (శుక్రవారం నుంచి శనివారం ఉదయం 8.30 గంటలలోపు, అలాగే ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు).వత్సవాయి 94.2 మిల్లీమీటర్లు- 68.4 మిల్లీమీటర్లు, జగ్గయ్యపేట 81.4-83.0, పెనుగంచిప్రోలు 88.6-87.6, నందిగామ 103.6-138.6, వీర్లుపాడు 103.2-210.0, మైలవరం 184.2-58.2, గంపలగూడెం 127.4-131.8, తిరువూరు 89.0-43.8, ఎ కొండూరు 127.4-84.8, రెడ్డిగూడెం 100.2-66.8, విసన్నపేట 88.2-63.8, జి కొండూరు 197.4-83.8, కంచికచర్ల 100.8-203.0, చందర్లపాడు 110.2-111.0, ఇబ్రహీంపట్నం 183.8-153.0, విజయవాడ రూరల్ 167.8-135.4, విజయవాడ సెంట్రల్ 172.4-125.2, విజయవాడ తూర్పు మండలం 174.2-125.4, విజయవాడ దక్షిణ మండలం 173.2-125.8, విజయవాడ పశ్చిమ మండలం 172.4 ఎం.ఎం- 125.2 ఎం.ఎం చొప్పున వర్షపాతం నమోదు అయినట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం అధికారులు వెల్లడించారు.



వీరులపాడులో...



పెనుగంచిప్రోలు



రెడ్డిగూడెంలో...



నందిగామలో...

అధికారులను అప్రమత్తం చేశాం

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి.సిసోడియా

మొగల్రాజపురం బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి - విజయవాడ, అర్బన్ :

భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలను తక్షణ సహాయక చర్యలు అందించేలా అధికారులను అప్రమత్తం చేశామని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి. సిసోడియా తెలిపారు. నగరంలోని మొగల్రాజపురం సమీపంలోని సున్నపు బట్టీల ప్రాంతాన్ని శనివారం ఆయన... కలెక్టర్ డా. జి. సజనతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ కొండచరియలు విరిగిపడి ప్రాణాలు కోల్పోవాయి వారి కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో విఎంసి కమిషనర్ హెచ్‌ఎం. ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవాని శంకర్, తహశీల్దార్ రోహిణి పాల్గొన్నారు.

భారీ విపత్తు

- స్తంభించిన జనజీవనం
- భారీ వర్షాలకు నీటమునిగిన పంట పొలాలు
- బండారుగూడెంలో ఊర చెరువుకు గండి
- దిక్కుతోచని స్థితిలో రైతులు
- అవనిగడ్డ మండలం పాతఎడ్లలంకలో పడవలపై ప్రయాణం


చల్లపల్లి మండలంలో నీటమునిగిన పొలాలు

ఎడతేరిపి లేని వర్షంతో కృష్ణాజిల్లా వ్యాప్తంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. పలు రహదారులు నీట మునిగాయి. జిల్లా వ్యాప్తంగా వరిపొలాలు నీట మునిగి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బాపులపాడు మండలం బండారుగూడెంలో ఊర చెరువుకు గండి పడింది.అలాగే అవనిగడ్డ మండలంలో పాతఎడ్లలంకకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో పడవల మీద ప్రయాణం చేస్తున్నారు. పులిగడ్డ ఆక్విడెక్టు వద్ద 14 అడుగుల మేర వరద ప్రవాహం కొనసాగుతోంది. వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రజలకు సూచించారు.

ప్రజాశక్తి - గుడివాడ : గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ప్రభావంతో వివాడ నియోజకవర్గంలోని పలు రహదారులు నేత మునిగాయి. సరైన డ్రైనేజీ సిస్టం లేకపోవడంతో కురిసిన వర్షపు నీరు రోడ్లపై నిలిచి వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా గుడివాడ బస్టాండ్, గుడివాడ బైపాస్ రోడ్డు, పదో వార్డులో ఉన్న కుమ్మరి చెరువు నిండిపోయి చెరువుగట్టు పై ఉన్న ఇళ్ల నీట మునిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే నందివాడ మండలం జనార్ధనపురం నాగవరప్పాడు మధ్యన పొలాలు అధిక వర్షాలకు పంట పూర్తిగా నీట మునిగింది అదేవిధంగా గుడివాడ పోలుకొండ రహదారి అధిక వర్షాల ప్రభావంతో రహదారి గుంతల మయమై నీళ్లు నిలిచి ప్రయాణానికి ఆటంకంగా మారింది. **ప్రజాశక్తి-చల్లపల్లి** గత రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు వరిపొలాలు నీటమునిగాయి. మండల పరిధిలోని వెలువోలు నిమ్మగడ్డ, యార్లగడ్డ, పురిటిగడ్డ, పాగోలు, మాజేరు గ్రామాలలో వరి పొలాలునీట మునిగాయి. నీట మునిగిన వరి పొలాలను మండల వ్యవసాయ శాఖ అధికారిని జి సాయి సింధు పరిశీలించారు. **ప్రజాశక్తి-గన్నవరం :** భారీ వర్షాలకు గన్నవరం మండలంలో పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. రమణమ్మ చెరువు, రాజీవ్ కాలనీ, దళితవాడ, వెంకట నరసింహపురం, దాసరి కాలనీ, తెంపల్లి గంగిరెద్దుల కాలనీ, కేసరపల్లి చంచల కాలనీ ఏరియాల్లో ఇళ్లు నీట మునిగాయి. నివాసితులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగు కాలువలు పొంగి రోడ్ల మీదకు రావడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులకు గురయ్యారు. వివిధ గ్రామాల్లో వరి పొలాలు నీట మునిగాయి. వరిపంట మునిగిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు నిండా ముంచాయని రైతులు కన్నీరు పెడుతున్నారు. మెట్ట గ్రామాల్లోని చెరువులన్నీ పొంగిపొర్లుతున్నాయి. మర్లపాలెం చెరువు పొంగడంతో దిగువ ఉన్న వరి పొలాలు, పల్లపు ఏరియాలోని ఇల్లు మునిగాయి. పోలీస్ స్టేషన్ మునిగిపోవడంతో సిబ్బంది, అధికారులు అగచాట్లకు గురయ్యారు. దుర్గాపురం ఎంపీపీ స్కూలు,గన్నవరం బాలురు ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలకు నీరు చేరింది. రెండు రోజుల వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమయింది. జనాలు పడరాని పాట్లు పడ్డారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు కోరారు. రెవెన్యూ కార్యాలయం, పోలీస్ స్టేషన్ కారిపోయి తడిసి ముద్దయింది. బుద్ధవరంలో నీట మునిగిన ఇళ్లను సర్పంచి బడుగు బాలమ్మ పరిశీలించారు. పింఛన్ల పంపిణీ సకాలంలో జరిగేలా పరివేక్షించారు.

బండారుగూడెంలో ఊర చెరువుకు గండి

బాపులపాడు మండలం బండారుగూడెంలో ఊర చెరువుకు గండి పడింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చెరువు నిండిపోవడంతో కట్ట తెగింది. నీరంతా గ్రామంలోకి రావడంతో పంచాయతీ కార్యాలయం మునిగిపోయింది. రోడ్లపై ఉదతంగా నీరు ప్రవహిస్తోంది. చెరువులో నీరంతా ఊళ్లోకి వస్తే ఇళ్లు మునిగిపోతాయని జనం భయపడుతున్నారు. రోడ్లపై నీరు ప్రవహించడంతో వాహనచోదకులు జనాలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో అధికారులతో పాటు సిపిఎం నాయకులు బర్రెలను బాబు పర్యటించి ముంపు గురైన పొలాలను పరిశీలించారు. ఇళ్లను చూశారు. ముంపు బాధితుల ఆదుకోవాలని కోరారు. పంచాయతీ కార్యాలయం మెరక చేయాలని విన్నవించారు.

అలాగే జక్కులనెక్కలం వద్ద ఉన్న బుడమేరు వంతెన వరద నీటిలో మునిగిపోయింది. నడుము లోతు నీటి ప్రవా హంతో ఉదతంగా ప్రవహిస్తోంది. నీళ్లలో నడిచి వెళ్లడానికి వెళ్లడానికి జనాలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. కేసరపల్లి వద్ద వంతెన పై నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు జేమ్స్ పేట, జగనన్న కాలనీ, కౌతరం ఒకటో వార్డు ప్రాంతాల్లో రోడ్లు కాలువలను తలపిస్తున్నాయి. గ్రామస్తులు ఇంటి నుండి బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డలో శుక్రవారం రాత్రి నుండి ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండడంతో జనజీవనం స్తంభించిపోయింది. శుక్రవారం తెల్లవారుజామున నాలుగున్నర నుండి శనివారం మధ్యాహ్నం రెండు గంటల వరకు 10.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. అవనిగడ్డలోని ప్రభుత్వ కార్యాలయం చుట్టూ వర్షపు నీరు చేరగా పంచాయతీ పరిధిలోని లంకమ్మవాన్యం సింహాద్రి కాలనీ ఏడో వార్డులోని ఉరకచెరువు రెండో వార్డ్ లోని ఎస్టీ కాలనీ లలో ఇళ్ల చుట్టూ వర్షపు నీరు చేరగా ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. కాగా బందులాయి చెరువు నుండి రత్నకోడులో కలిసే మురుగు కాలవ అసరాపాలెం సమీపంలోని పంట పొలాలను ముంచేసింది. భారీ వర్షాలతో డ్రైనేజీలు పొంగిపొర్లతో ఉండటంతో పాటు పంట పొలాలను ముంచేయడంతో ఆ పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మరోవైపు నాగాయలంక మండలం పక్కపట్ల వారి పాలెం సమీపంలోని పంట పొలాలు కూడా వర్షపు నీటి ముంపుకు గురయ్యాయి.

కృష్ణానదికి పెరిగిన వరద

ఒకపక్క భారీ వర్షాలతో పంటలు ముంపు గురై రైతుల ఆందోళన పడుతుంటే మరోవైపు కష్ణా నదికి వరద ఉధతి పెరగడంతో కష్ణానది పరివాహక ప్రాంతాల్లోని లంక భూముల్లో పంటలు ముంపు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది ప్రకాశం బ్యారేజీ నుండి 3.4 0 లక్షల క్యూసెక్యుల నీరు దిగువకు విడుదల చేయగా మరోవైపు మరో నాలుగు లక్షల క్యూసెక్కుల నీరు రానున్నట్లు సమాచారం అందడంతో అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. ఇప్పటికే నదీ గర్భంలోని గ్రామమైన పాతఎడ్లలంక బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోగా ఆ గ్రామ ప్రజలు పడవలను ఆశ్రయించి ప్రయాణాలు చేస్తున్నారు. కాగా పులిగడ్డ ఆక్విడెక్టు వద్ద 14 అడుగుల మేర వరద ప్రవాహం కొనసాగుతుంది. అదే జరిగితే నది పరివాహక ప్రాంతంలోని మెట్ట పొలాల పంటలన్నీ వరద ముంపు గురయ్యే ప్రమాదం ఉంది. దివిసీమలో భారీ వర్షాలు కురుస్తుండడంతో అమెరికా పర్యటనలో ఉన్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఫోన్ ద్వారా అధికారులకు సూచనలు చేశారు తక్షణమే ముంపు నివారణ చర్యలు చేపట్టాలని కూటమి నాయకులు గ్రామాల్లో పర్యటించి సమస్యలు అధికారుల దష్టికి తేవాలని సూచించారు.**ప్రజాశక్తి-గుడివాడరూరల్:** గత రెండు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు పంట పొలాలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారు. నందివాడ మండలం జనార్ధనపురం నాగవరపాడు మధ్య పంట పొలాలు నీట మనిగాయి. ప్రభుత్వం తక్షణమే రైతులను ఆదుకోవాలని జనార్ధనపురం రైతు సంఘం నాయకులు ప్రసాదు, కష్ణమూర్తి, తదితరులు డిమాండ్ చేశారు.**ప్రజాశక్తి-ఘంటసాల :** ఘంటసాల మండల పరిధిలో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వరి పొలాలు సముద్రాన్ని తలపిస్తున్నాయి. మండల పరిధిలోని గోగినేనిపాలెం, తెలుగు రావు పాలెం, కొడాలి, చిట్టుర్పు, మల్లెచిట్టూరు, యండకుదురు గ్రామాలలో వరి పొలాలు నీట మునిగాయి. గత రెండు రోజుల క్రితం వరకు వరి పొలాలకు నీరు అందక నాట్లు వేయడానికి రైతులు నానా కష్టాలు పడి కాలువల వద్ద పడి కాపుల కాసి వత్తులు వారీగా వేయ ప్రయాసలతో పంటను కాపాడుకుంటూ వచ్చారు. ఒక్కసారిగా వాతావరణం మారి గత రాత్రి నుంచి కురిసిన భారీ వర్షాల కారణంగా వరి పొలాలు సముద్రాన్ని తలపిస్తూ ఉండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని వడ్లమన్నాడు ప్రధాన మురికి కాలువ వరద నీరు నిండిపోవడం ఆ నీటి ప్రవాహం పంట పొలాల్లోకి చేరి వరి పంట కు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మురికి కాలువ రైల్వే బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు అడ్డు ఉండటంతో హెచ్ఎఫ్ఎల్ గరిష్ట వరద సూచిక దాటి నీరు అధికం గా చేరటంతో మురికి కాలువ పక్కన ఉన్న పంట పొలాలు రైతులు ఆందోళన చెందుతున్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** మండలంలో శుక్రవారం సాయంత్రం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. పంటలపొలాలు నీట మునిగాయి.కృష్ణానది పాయకు వచ్చిన వరద కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమై లంకల్లోని పొలాలు నీట మునిగాయి. కష్ణా నది పాయలో వరద ఉధతంగా ప్రవహిస్తున్న కారణంగా రైతులు, పశువుల కాపరులు పాయ అవతలి వైపుకు వెళ్ళవద్దని తాసిల్దారు కుసుమకుమారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అత్యవసరమైన సమయంలో తప్ప నాటుపడవలను ఉపయోగించరాదని తెలిపారు. రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని తెలిపారు.నదీ ప్రవాహం పట్ల అవగాహన కల్పించాలని ఆమె తెలియజేశారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లి మండలంలోగత రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. బంటుమిల్లి, నాగేశ్వరరావుపేట, పెద్ద తుమ్మిడి, ములపర్రు, మలపరాజుగూడెం పంట పొలాల చెరువులను తలపిస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** గుడివాడ బస్టాండు అభివద్ధిలో వెనకబడిపోవడంతో ప్రజలు ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనేకమంది ఎమ్మెల్యేలు గెలిచారుగానీ బస్టాండ్ మాత్రం అభివద్ధికి నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా పాలకవర్గాలు గుడివాడ అభివద్ధిలో ఇచ్చిన మాట ప్రకారం అభివద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం, నాయకులు రేపాని కొండ తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-ఉంగుటూరు :** భారీ వర్షాలతో మండలంలోని తేలప్రోలు, ఆముదాలపల్లి, ఎలుకపాడు, ఆవుటపల్లి, ఆత్కూరు, మానికొండ, నాగవరప్పాడు జగనన్న కాలనీలో బారీగా చేరిన వర్షపు నీరు చేరి ప్రజలు తీవ్ర అవస్థలుపడ్డారు. ఆముదాలపల్లిలో ఆయిల్ ఇంజిన్ ద్వారా ఇళ్ళల్లో నీరు బయటకు పంపుతున్నారు. మండలం లోని వివిధ గ్రామాల్లో వరి పంట పూర్తి స్థాయిలో నీట మునిగింది. **ప్రజాశక్తి- మొవ్వ :** వర్షాలకు దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని అవిరిపూడిలో పర్యటించిన ఆయన నీట మునిగిన పొలాలను పరిశీలించారు.


గుడివాడలో నీటమునిగిన బస్టాండ్


గన్నవరం మండలం బుద్ధవరంలో ఇళ్లలోకి వచ్చిన నీరు


అవనిగడ్డ అక్విడెట్ వద్ద ప్రవహిస్తున్న వరద నీరు


గన్నవరం పోలీస్‌స్టేషన్ వద్ద వరద నీరు


తోట్లవల్లూరు మండలంలోనీట మునిగిన పంటలు


ఉంగుటూరు మండలంలో నీట మునిగిన పొలాలు

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
ఆదివారం
1 సెప్టెంబర్ 2024

కుండపోత



విజయవాడలోని మునిగిన బందరు రోడ్డు (పక్కన చెరువును తలపిస్తోన్న రహదారి)





విజయవాడ బస్టాండ్ వద్ద రైల్వే బ్రిడ్జి వద్ద మునిగిన వాహనాలు



విజయవాడలో విరిగిపడిన కొండచరియలు



విజయవాడలో నీట మునిగిన రహదారులు



విజయవాడలో చెరువును తలపిస్తోన్న రహదారి



విజయవాడలో వన్‌టౌన్ ప్రాంతంలో నీట మునిగిన రహదారి



మైలవరంలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



విజయవాడ వన్‌టౌన్ ప్రాంతంలో విరిగిపడిన చెట్లు



అవనిగడ్డలో నీటమునిగిన పంట పొలాలు



గుడివాడ మండలంలో నీట మునిగిన పొలాలు చూపిస్తున్న రైతులు



విజయవాడలో చెరువును తలపిస్తోన్న రహదారి

కుండపోత

వర్షాలతో ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాలలో జనజీవనం పూర్తిగా స్తంభించింది. పంట పొలాలు, రోడ్లు జలమయం అయ్యాయి. విజయవాడ జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఎటువైపు చూసినా మోకాళ్లలోని నీళ్లు రోడ్లపై నిలిచిపోయాయి. విజయవాడ మొగల్రాజపురం సున్నపుబట్టీల సెంటరు ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడి నలుగురు దుర్మరణం పాలయ్యారు. దుర్గగుడి ఘాట్ రోడ్డుపై కొండచరియలు విరిగిపడ్డాయి. విజయవాడ పండింట్ నెహ్రూ బస్టాండ్ జలదిగ్బంధంలో చిక్కుకుంది. బస్‌స్టేషన్ ప్రాంతం మొత్తం జలమయం కావడంతో ప్రాయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.భారీ వర్షాల కారణంగా గన్నవరం విమానాశ్రయంలో విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. కృష్ణాజిల్లాలో పంటపొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అవనిగడ్డ మండలంలో పాత ఎడ్లలంక గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.



విజయవాడలో కొండచరియలు విరిగిన ప్రాంతంలో సహాయక చర్యలు



విజయవాడలో విరిగిన కొండచరియలు



విజయవాడలో ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి



ఉంగుటూరు మండలంలో నీటిని తోడిపరబోస్తున్న మహిళ




విజయవాడలో వరద బాధితులతో మాట్లాడుతున్న సిహెచ్ బాబూరావు



గుడివాడలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



గుడ్లవల్లేరు మండలంలో...



గన్నవరం మండలం బుద్ధవరంలో చెరువుకు గండిపడిన దృశ్యం




ఇబ్రహీంపట్నంలో మోకాల్లోతు నీరు వచ్చిన దృశ్యం



ఘంటసాల మండలంలో నీట మునిగిన పంట పొలాలు



మొవ్వ మండలంలో నీట మునిగిన పంట పొలాలు



గన్నవరం మండలం కేసరపల్లి వద్ద పొంగిన బుడమేరు కాలువ



కంచికచర్లలో రోడ్డుపై ప్రవహిస్తోన్న నీరు



కంకిపాడు మండలంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

వర్ష బీభత్సం

ఎన్‌టిఆర్ జిల్లాలో పలుచోట్ల కురిసిన వర్షాలకు రోడ్లు జలమయమాయ్యయి. ప్రజల రాకపోకలు స్తంభించాయి. శుక్రవారం నుండి కురుస్తున్న భారీ వర్షాలకు పలుచోట్ల వర్షపు నీరు ఇళ్లల్లో చేరి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల ఇళ్లు పడిపోయాయి. మండలాల్లో వాగులు, చెరువులు పొంగిపొర్లాయి. పంటలు నీట మునిగాయి.

ప్రజాశక్తి - వీరులపాడు : కంచికచర్ల మధిర రోడ్డుపై జగన్నాథపురం జుజ్జూరు గ్రామాల్లో ఉన్న వాగులు పొంగి వాహనదారులకు పలు ఇబ్బందులకు గురయ్యారు. గుడి మాధవరం ఏనుగుడ్డు వాగు పొంగి గ్రామంలో ఎస్సీ దళితపేటలో పెద్ద ఎత్తున నీరు చేరింది. పలువురు పేదలు నివాసాల్లో వరద నీరు చేరడంతో నిత్యావసర వస్తువులు తడిసిపోయి ఇబ్బందులకు గురయ్యారు. జయంతి, దొడ్డదేవరపాడు, వీరులపాడు, పల్లంపల్లి, కొణతాలపల్లి గ్రామాల వాగులు పొంగి వరద ముంపుతో గ్రామాలకు రహదారి సౌకర్యం లేకుండా పోయింది. తహశీల్దార్ రాజా కిషోర్ జుజ్జూరు గ్రామ రెవెన్యూ అధికారి సయ్యద్ గౌస్ ఆర్ఐ.బాబు గ్రామపంచాయతీ కార్యదర్శులు సర్పంచులు ప్రజల ఇబ్బందులు ఉన్నతాధికారులు దృష్టి తీసుకెళ్లి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. అల్లూరులోని ఏనుగుడ్డు వాగులో ఇద్దరు వ్యక్తులు చిక్కుకోవడంతో తహశీల్దార్ రాజకుమార్ కంచికచర్ల అగ్నిమాపక బృందం వారితో చిక్కుకున్న వారిని కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివిధ గ్రామాల్లో ఉన్న చిన్న పరిశ్రమలకు భారీ వర్షాల వల్ల నష్టవాటిల్లింది. రైతుల నష్టపోయారు. ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. భారీ నుండి అతి భారీ వర్ష సూచన ఉన్న తరుణంలో ఎవరూ ఇంటి నుండి బయటికి రావొద్దని, ప్రయాణాలు వుంటే వాయిదా వేసికోవాలని తహశీల్దార్ రాజా కిషోర్ సూచించారు. అల్లూరు గ్రామనికి చెందిన మల్లెల రాఘవేంద్ర రావు, కొండల బాలకృష్ణ ఉదయం 6:30 గంటలకు ఏనుగు గడ్డ వాగు దాటి పొలం చూడటానికి వెళ్లారు. తిరికి వచ్చే సరికి వాగు పొంగిపొర్లుతుండటంతో వాగు దాటలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామస్తులు రెవెన్యూ వారికి సమాచారం ఇవ్వడంతో తహశీల్దార్ రాజకిషోర్ అప్రమత్తమై కంచికచర్ల అగ్నిమాపక దళాన్ని పిలిపించారు. ఏనుగు గడ్డ వాగు ఆవల చిక్కుకున్న ఇరువురి యోగక్షేమాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారిని రక్షించే ఏర్పాట్లను దగ్గరుండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. చిక్కుకున్న ఇరువురు దగ్గరలో ఉన్న రంగాపురం చేరుకోవటం తో వారితో ఫోన్ స్వయంగా మాట్లాడి వారి క్షేమం గురించి వాకబు చేశారు. గూడెంమాధవరం గ్రామం వద్ద వాగు పొంగి పొర్లటంతో తహశీల్దార్ పర్యవేక్షించారు. **మైలవరం :** లోతట్టు ప్రాంతాలు, రహదారులన్నీ జలమయమయ్యాయి. వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. పుల్లూరు నుండి జమలాపురం వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జి పైకి వరదరావడంతో ఓ ప్రైవేట్ కళాశాల బస్సు వరదలు ఇరుక్కుపోయింది. స్థానికులు అప్రమత్తమై ట్రాక్టర్ల సహాయంతో బస్సును సురక్షితంగా తీసుకొచ్చారు. చిలుకూరి వారి గూడెం, చంద్రగూడెం శివాలయం, దాసులపాలెం వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జిలపైకి వరద ఉధృతంగా రావడంతో రాకపోకలు స్తంభించాయి. **కంచికచర్ల :** మండలంలో సుమారు 20 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. స్థానిక ఆర్‌టిసి బస్టాడ్ ఆవరణ నీట మునిగి బస్సులు ఎక్కి, దిగే ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక మధిర రహదారి ఆక్రమణకు గురై, వాగులు పూడ్చి వేయటం వల్ల వరద నీరు కిలోమీటర్ మేర రోడ్డుపై ప్రవహించిది. రోడ్డు పై 4 అడుగుల మేర వరద ప్రవహించటంతో రోడ్డు ధ్వంసమైంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానిక ఇందిరా కాలనీలో, అంబేద్కర్, అరంధతీ కాలనీలు నీట మునిగి ఇళ్లల్లోకి వరద చేరింది. భారీ వర్షానికి నాని మండల పరిషత్ కార్యాలయ ఆవరణ లో ఉపాధి హామీ పథకం కార్యాలయం సమీపంలో గల 50 ఏళ్ల నాటి చింత చెట్టు కూకటి వేళ్లతో సహా ఊడి పడిపోయింది. చెట్టు పడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని జనం ఊపిరి పీల్చుకున్నారు. ఎంపీడీఓ కె.శిల్ప జెసీబీ సహాయంతో పడిపోయిన చెట్టును పక్కకు నెట్టించారు. రెండు రోజుల్లో సూమారు 20 సెంటీ మీటర్ల వర్షం కురిసింది.. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు చెవిటికల్లు వద్ద గల లక్ష్మయ్య వాగుకు ప్రవాహానికి వరద నీరు రోడ్డుపై 5 అడుగుల మేర ప్రవహించింది. చెవిటికల్లు రోడ్డు కోతకు గురై బీసీ కాలనీలోకి వరద ప్రవాహం చేరటంతో ఇళ్ళు నీట మునిగాయి తోల్లవాగు, నక్కలవాగుకు వరద చేరింది. **ఎ.కొండూరు :** అడ్డ రోడ్డు నుండీ విస్సన్నపేటకు వెళ్ళే రోడ్డుపై కుమ్మరి కుంట తండా సమీపాన వాగు పొంగటంతో రాకపోకలు నిలిచి పోయాయి. రేపూడి నుండీ పుట్రాల వెళ్లే రహదారి పై సీతమ్మ వాగు పొంగింది. చీమలపాడు పెద్ద చెరువు అలుగు పెద్దా తండా సమీపంలో రాక పోకలు స్తంభించాయి. కృష్ణా రావు పాలెం హరిజన వాడలోను గృహాలలోకి మోకాళ్ళ లోతు వర్షపు నీరు చేరటంతో అక్కడి ప్రజలు బాధలు వర్ణనాతీతం. మండలంలో 127.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యినట్టు డిప్యూటీ తహశీల్దార్ నందకుమార్ తెలిపారు. **జగ్గయ్యపేట:** మండలంలోని శుక్రవారం రాత్రి నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి జగ్గయ్యపేట ప్రాంతంలో జన జీవనం స్తంభించింది. గ్రామాలలో వీధులు, పంట పొలాలు జలమయంగా మారి చెరువును తలపింపచేసాయి. వివిధ గ్రామాల్లో గల చెరువులు, కుంటలు, బావులు నిండి అలుగులు పారుతున్నాయి. మండలంలో గల పాలేరు, మున్నేరు, ఎర్ర కాలువ లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని మత్స్యకారుల వేటకు వెళ్లొద్దని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సూచనలు చేయాలన్నారు. **తిరువూరు :** వరద రోడ్లపై ఉధృతంగా ప్రవహిస్తుంది. దీనితో కొన్ని గ్రామాల నుండి తిరువూరు కు రాకపోకలు స్తంభించాయి. లక్ష్మీపురం, మల్లెల గ్రామాల మధ్య అలుగు, చౌటపల్లి, జి.కొత్తూరు గ్రామాల మధ్య ఉన్న వెదుళ్ల వాగు బ్రిడ్జిపై నుండి వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. చింతలపాడులో గుర్రపు వాగు అలుగు, మునకుళ్ళ శివాలయం వద్ద అలుగు వాగు పొంగి ప్రవహించడంతో పోలీసులు రాక పోకలను నిలిపివేసి కాపలా ఉంటున్నారు. తిరువూరు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలలోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. బస్టాండ్ అవరణం వరద ముంపుకు గురైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ గిరిబా బు, ఎస్ ఐ సత్యనారాయణ, ఎంపీడీవో నాగేశ్వరరావు లు సూచించారు. మండలంలో భారీ వర్షాలు కారణంగా ఎటు వంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతి గృహాల్లోని బాలి కలను సురక్షితమైన ప్రాంతాల్లోకి అర్‌డిఓ మాధవి తరలించారు. తిరువూరు పట్టణంలోని రెండు సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహాలు ఒకటి అద్దె భవనంలో ఉండగా మరొకటి ప్రభుత్వ భవనంలో నడుస్తున్నాయి. మొత్తం సుమారు 200 మంది బాలికలు ఒకటి నుండి 10వ తరగతి వరకు ఈ హాస్టల్లో చదువుతున్నారు. వసతి గృహాల భవనాలు శిథిలా వ్యవస్థలో ఉన్నందున భారీ వర్షాలకు ఎటువంటి ప్రమాదము జరగకుండా ముందు చర్యలలో భాగంగా సురక్షిత ప్రాంతమైన తిరువూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల భావనాల్లోకి బాలికలను అర్ డిఓ ఆదేశాల మేరకు సంక్షేమ అధికారులు తరలించారు. **రెడ్డిగూడెం :** 25 సంవత్సరాల్లో ఇంత పెద్ద వర్షం ఇప్పటి వరకు రాలేదని పలువురు చెబుతున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి, పూరిళ్ళు కూలాయి. పలుచోట్ల చెట్లు పడిపోయాయి. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. చెరువులు పూర్తిగా నిండాయి. వరదల్లో కోతుల వాగు నుంచి పాములు, పెద్ద మొద్దులు, చెట్లు ప్రవాహానికి వచ్చి నివాస ప్రాంతాల్లో చేరడంతో ప్రజలు బెదిరిపోయారు. కోతుల వాగును ఆక్రమించడంతో వాగు ఇరుకుగా మారింది. ఇలాంటి వరదల కారణంగా గ్రామం ముంపుకు గురౌతుంది. ముంపు ప్రాంతాల్లో తహశీల్దార్ సుశీలదేవి, రెవిన్యూ సిబ్బంది పర్యటించారు. **విసన్నపేట :** తెల్లదేవరపల్లి మాలపల్లి లో ఇళ్లలోకి, రోడ్లకి ఇరువైపులా వర్షపు నీరు నిల్వ ఉన్నందున ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ రాయల నాగమణి ఆదేశాల మేరకు టిడిపి నాయకులు రాయల సురేష్, గ్రామస్తులు జెసిబితో కాలవుల పూడిక తీయించి తద్వారా వర్షపు నిల్వ నీరు పారుదలయ్యేలా చేయించారు. పలుచోట్ల భారీగా కురిసిన వర్షం వలన డ్రైనేజీలు వరదలు పొంగి పొరీలాయి. **పెనుగంచిప్రోలు:** పెనుగంచిప్రోలు చెరువు కూడా నిండుకుండలా మారింది. దీంతో రెవెన్యూ, మండల పరిషత్, పంచాయతీ అధికారులు ముందుస్తు జాగ్రత్తలు చర్యలలో భాగంగా లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలను అప్రమత్తం చేశారు. తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం కొత్త సత్రాల్లో వారికి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ప్రజలకు తమ నివాసాలు వద్ద ఏమైనా ఇబ్బందికరమైన పరిస్థితుల్లో ఉంటే వెంటనే పునరావాస కేంద్రానికి రావాలని రెవిన్యూ అధికారులు సూచించారు.. మున్నేటిలో వున్న తాత్కాలిక దుకాణదారులను పైకి తీసుకు వచ్చారు. మండలం లోని పలు పంట పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. గ్రామాలకు, నందిగామ లకు, వత్సవాయి మండలాలకు రాకపోకలు నిలిచి పొయ్యాయి. రహదారులు పైకి వరద ప్రవాహం భారీగా రావడంతో కార్లు, బైకులు, ఆటోలు, ఆర్‌టిసి బస్సులు సైతం నిలిచి పొయ్యాయి. చెరువు పూర్తి స్థాయిలో నిండి ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలో చెరువు ఆలుగులు, చప్టాల మీద నీటి ప్రవాహం భారీగా ప్రవహిస్తోంది.. ముఖ్యంగా పంట పొలాలు, నాట్లు వేసిన పొలాలు, వరి నారు మడులు లలో వరదలతో నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వర్షపునీటిలో చిక్కుకున్న కుటుంబాలకు భోజనాల అందజేత

భవానీపురం : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మోకాలి లోతున రోడ్లపై నీరు నిలవడంతో బయటకు వచ్చేందుకు వీల్లేక వర్షపు నీటిలో చిక్కుకున్న పలు కుటుంబాల వారికి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆదేశాల మేరకు 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, తెలుగుదేశం నాయకులు దుర్గారావు దంపతులు భోజన ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రత్నకుమారి, దుర్గారావు మాట్లాడుతూ వర్షపు నీరు బయటకు పోయేలా కార్పొరేషన్ సిబ్బందితో కలిసి ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. ఇక్కడ పరిస్థితి విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు సుజనా చౌదరి కూడా ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు చెప్పారు.

ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పర్యటన

విజయవాడ : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు శనివారం జలమయం అయిన పలు లోతట్టు ప్రాంతాలను పర్యటించి, ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో వెళ్లిన ఎమ్మెల్యే నీట మునిగిన ఇళ్లను పరిశీలించి వెంటనే మురుగు నీరు మోటార్లు చెప్పించి బయటకు లాగవల్సిందిగా అదేశించి, స్థానికులకు భోజనం, టిఫిన్ ఏర్పాట్లు చూడవలసినదిగా సంబంధిత అధికారులను స్థానిక నాయకులను సూచించారు. మ్యాన్ హోల్, కరెంట్ తీగలు తెగిపడే ప్రమాదాలు జరగకుండా చూడాలని, ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని తెలిపారు. **ఇబ్రహీంపట్నం :** వరదనీరు ఉధృతి ఎక్కువగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్ సూచించారు. బుడమేరుకు నీటి ప్రవాహం పోటెత్తటంతో వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద ఇప్పటికే దాదాపుగా 10.5 అడుగులకు పైగా వరదనీరు పెరిగిందన్నారు. కొండపల్లి మున్సిపాలిటీలో పర్యటించారు. వరదల్లో చిక్కుకుపోయిన వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించి తక్షణమే ఆహారం, తాగునీరు సదుపాయాలు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇంట్లోనే ఉండే వారికి ఆహారాన్ని ప్యాకెట్లు రూపంలో అందించాలని తెలిపారు.

వరద బాధితులకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయాలి : సిపిఎం

కొండపల్లి మున్సిపాలిటీలో నీట మునిగి ఇళ్లల్లోకి నీరు చేరిన నేపథ్యంలో ప్రభుత్వం మున్సిపల్ అధికారులు సహాయ చర్యల కోసం ప్రత్యేక సహాయక శిబిరం ఏర్పాటు చేసి వరద బాధితులకు మౌలిక సదుపాయాలు, వసతి, భోజన ఏర్పాట్లు చేయాలని సిపిఎం కొండపల్లి పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం ఖాజీ మన్యం పెర్రి ఆర్టీసీ డిపో భీమరాజు గుట్ట ప్రసాద్ నగర్ , కొండపల్లి ఎస్టీ కాలనీ మోహన్ రావు నగర్ కోటయ్య నగర్ వడ్డే నగర్ చైతన్య నగర్ ఇందిరా కాలనీ శాంతినగర్ అరుణ నగర్ తదితర కాలనీలో ప్రజలు తీవ్ర వర్షానికి ఇళ్లల్లోకి నీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ కె బాషా, కోటయ్య నగర్ వాసులు తాతారావు,రాజా రత్నం, నాగరాజు, ఎలిషా తదితరులు పాల్గొన్నారు.

వీటీపీఎస్ కాలనీ లో పెద్ద పెద్ద చెట్లు, ఇబ్రహీంపట్నం – కొండపల్లి లో ఎస్ టీ కాలనీ, మోహన్ రావు నగర్, ఇందిరా నగర్, కిల్లా రోడ్, ఖాజీమాన్యం, గాజులపేట, ఫెర్రీ, దుర్గా కాలనీ, భీమరాజు గుట్ట ప్రసాద్ నగర్ తదితర లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రైల్వే వాళ్ళు వాళ్ళ ప్రాజెక్టు వర్క్ నిమిత్తము ఏర్పాటు చేసిన కల్వర్టు అడ్డుపడగా ప్రజలు వరద ముంపుకి గురయ్యారు. దీంతో రాజీవ్ నగర్ ప్రజలు మున్సిపాలిటీ సిబ్బంది ఇద్దరితో కలిసి వరద నీరుని వెళ్లిపోయే విధంగా చేసుకున్నారు. **వన్‌టౌన్ :** మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలో పలు ప్రాంతాల్లో కొండ చర్యలు విరిగిపడి ప్రజలు ప్రాణాలు కోల్పోవడం, నివాసాలు కోల్పోవడం ఆస్తి నష్టం జరగడం బాధాకరమని సిపిఎం ఫ్లోర్ లీడర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలోని పర్యటించారు.

దుర్గగుడిపై కొండరాళ్లు పడి పాక్షికంగా దెబ్బతిన్న డోనార్ సెల్

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఇటీవల నిర్మించిన డోనాల్ సెల్‌పై శనివారం కొండరాళు జారిపడి పాక్షికంగా దెబ్బతింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కమిషనర్ ఎస్.సత్యనారాయణ దేవస్థానానికి విచ్చేసి అత్యధికంగా కురుస్తున్న వర్షాల వలన కొండ రాళ్లు జారిపడి, పాక్షికంగా దెబ్బతిన్న డోనార్ సెల్‌ను ఆలయ కార్యనిర్వాహనాధికారి కె.ఎస్. రామారావు, ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి, చర్చించారు.

దుర్గగుడి ఘాట్ రోడ్డు మూసివేత : ఘాట్ రోడ్ నందు భక్తుల భద్రత దష్ట్యా ఘాట్ రోడ్ నందు తాత్కాలికముగా యాత్రికులకు వాహనములకు ప్రవేశం నిలుపుదల చేసినట్లు ఆలయ ఇఓ కెఎస్ రామారావు తెలిపారు. అందరూ లిఫ్ట్ మార్గాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని వన్‌టౌన్, కొత్తపేట, చిట్టినగర్, పాతబస్తీలోని వించిపేట, 50వ డివిజన్‌లోని రాఘవ రెడ్డి రోడ్డు నుండి జెండా చెట్టు రోడ్డు ప్రాంతం, విద్యాధరపురం లేబర్ కాలనీ, భవానీపురం హౌసింగ్‌బోర్డు కాలనీ, రాజరాజేశ్వరీ పేట, ఊర్మిళానగర్, ప్రియదర్శినీ కాలనీ తదితర ప్రాంతాలు నీటమునిగిపోయి. కబేళారోడ్డులోని రాముక్వారీ కొండప్రాంతంలో ఏలూరి కిరణ్‌కుమార్ ఇంటిపై కొండపై వున్న చెట్టు విరిగిపడటంతో ఇల్లు కొంతమేర దెబ్బతింది. అలాగే సితార ఎదుట కొండమీద ఇళ్లపై కూడా కొండరాళ్లు, పిచ్చింగ్‌లు జారిపడ్డాయి.

సొరంగ మార్గంలోకి వాహన రాకపోకలు నిలిపివేత...

విద్యాధరపురం– చిట్టినగర్‌లను అనుసంధానం చేసే సొరంగం మార్గంలో ముందుజాగ్రత్త చర్యగా రాకపోకలను నిలిపివేశారు. 53వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ మహదేవు అప్పాజీ జోరువర్షంలోనూ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. కార్పొరేషన్ సిబ్బందితో సహాయచర్యలు చేపట్టారు.. కాగా పశ్చిమ నియోజకవర్గం పరిధిలో మురుగునీరు రోడ్లను ముంచెత్తింది.

వర్షాలకు 51వ డివిజన్‌లో కూలిన ఇళ్లు
తప్పిన పెను ప్రమాదం

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పశ్చిమ నియోజకవర్గంలోని రోడ్లన్నీ వర్షం నీటితో మునిగిపోయాయి. ముఖ్యంగా సైడు డ్రైన్లు నీటితో మునిగిపోవటంతో మరింత నీరు రోడ్లపైకి చేరిపోయాయి. దీంతో పల్లపు నివాసాల్లోకి వర్షపు నీటితో పాటు మురుగునీరు కూడా చేరిపోయాయి. చేసేది లేక చాలామంది మంచాలు, కుర్చీలపైనే కూర్చుండిపోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో 51వ డివిజన్‌లో పితాని అప్పలస్వామి వీధి కొండపైన నివాసం ఉంటున్న ఎరుసు నీలమ్మ ఇల్లు తెల్లవారుజామున రెండున్నర గంటలకు కూలిపోయింది. రాజగిరి వారి వీధిలో కొండపైన మరో ఇల్లు కూలిపోయాయి. స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్ వెంటనే పశ్చిమ ఎమ్మార్వో ఇంతియాజ్‌కి, విఆర్‌ఓలు జయరాజు వెన్నెల, మున్సిపల్ అధికారులకు, ఇంజనీరింగ్ విభాగం వారికి, శానిటేషన్ విభాగం వారికి తెలియచేసి వారిని అప్రమత్తం చేశారు. దీంతో శనివారం ఉదయం 6 గంటలకు వర్షంలో కూడా వారిని ఘటనా స్థలానికి తీసుకువచ్చి నిర్వాసితులైన తొమ్మిది కుటుంబాలను, విద్యార్థులకు లేబర్ కాలనీకి తరలించి అక్కడ వారికి ఆశ్రయం కల్పించారు. కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్‌తో పాటు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సచివాలయం సిబ్బంది శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వారిని సిపిఎం పశ్చిమ సిటీ నాయకులు కె.సూరిబాబు శనివారం పరిశీలించి వారిని పరామర్శించారు.

ఇళ్లు కూలిన ప్రాంతాల్లో పర్యటించిన పశ్చిమ తహశీల్దార్ పాషా

పశ్చిమ నియోజకవర్గంలోని ఇళ్లు కూలిన ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో పశ్చిమ తహసిల్దార్ ఎస్.కె ఇంతియాజ్ పాషా శనివారం పర్యటించి, బాధితులకు సహాయ కార్యక్రమాలు చేపట్టారు.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ వారి క్యాంపు కార్యాలయం నుండి జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి నుండి పై స్థాయి వరకు అధికారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్లో 24 గంటలు పని చేసే విధంగా 08672 252572 ఫోన్ నెంబర్ తో ఒక కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేశామని ఎవరైనా సరే ప్రజలుగాని, ఇతరులు గాని వర్షాల వలన ఇబ్బందులు పడుతుంటే వెంటనే సంప్రదించాలన్నారు. ఎక్కడైనా వర్షాలకు గ్రామాలకు రాకపోకలు ఆగిపోయి ఉంటే గమనించి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలైన పునరావాస కేంద్రాలకు తరలించి వారికి కావలసిన భోజనము మంచినీరు తదితర సదుపాయాలను కల్పించాలన్నారు. అన్ని ప్రభుత్వ చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు గాలికి పడిపోయి ఉంటే వాటిని గుర్తించి వెంటనే పునరుద్ధరించడం గాని, విద్యుత్ సరఫరా ఆపివేయడం గానీ చేయాలని లేనిపక్షంలో ప్రజలు విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంత ప్రజలు, కృష్ణానది తీర ప్రాంత ప్రజలు సురక్షితంగా ఉండేలా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రభుత్వ ఆసుపత్రిలో కావలసినన్ని మందులతో నిరంతరం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్లో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, ఇన్చార్జి డిఆర్ఓ శ్రీదేవి, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు పాల్గొన్నారు.



వర్షాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ డికె బాలాజీ



స్కూల్ ఆవరణ మెరక చేయాలని నిరసన

పెనమలూరు : తాడిగడప మున్సిపాలిటీ తాడిగడప కార్మిక నగర్ 1లో ఉన్న స్కూలు వర్షం వస్తే ఆవరణ చెరువును తలపిస్తోందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో నాయకులు, మహిళలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. డివైఎఫ్ఐ యువజన సంఘం పెనమలూరు మండలం కార్యదర్శి పుసులూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వర్షం వస్తే స్కూలు ఆవరణ చెరువులను తలపిస్తోందని, ఇక్కడ 1 తరగతి నుంచి 5 తరగతి వరకు చదువుకునే చిన్న పిల్లలే ఉన్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. పెనమలూరు మండలం ఐద్వా మహిళా సంఘం కార్యదర్శి పుసులూరి పాత లక్ష్మీ, డివైఎఫ్ఐ యువజన సంఘం నాయకులు విసం సోమశేఖర్, సిహెచ్ నాగ దుర్గాప్రసాద్, మారోజు ప్రకాష్ రాజ్, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు. సిహెచ్ భవాని, విసం రవ ణమ్మ, సిహెచ్ విశ్వేశ్వరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

విఆర్ఒకు సత్కారం

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని భూషణగూళ్ళ గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న తుర్లపాటి భగవంతు రావు ఉద్యోగ విరమణ సభ శనివారం జరిగింది. ఈ సభకు మండల ఈఓపిఆర్డి వంగ శ్రీనివాస్ (వంశీ)అధ్యక్షత వహించారు. మండల తహసిల్దార్ రంగారావు, ఎంపీడీవో సీతమహాలక్ష్మి లు శాలువాలు, పుష్పగుచ్చాలు అందించి సత్కరించారు. ఎంఈఓ బొడ్డు శ్రీనివాస్, డిటి వాణి, ఎన్నారై కొల్లి శ్రీనివాస్, టిడిపి సీనియర్ నాయకుడు కొల్లి రమణ కుమార్, సంపంగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుండి నిత్యావసరాలు పంపిణీ : జెసి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సెప్టెంబర్ నెల నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఒకటవ తేదీ ఆదివారం ఉదయం నుండి ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు.చౌక ధరల దుకాణ డీలర్లు, ఎండియు ఆపరేటర్లుద్వారా సరుకుల పంపిణీని ప్రతిరోజు ఉదయం 7గంటలకు నిర్దేసించిన ఎడ్యూల్ ప్రకారం బియ్యం, పంచదార మొదలైన నిత్యావసర సరుకుల పంపిణీకి సిద్ధంగా ఉండాలన్నారు. కార్డు లోని ప్రతి వ్యక్తికి 5 కిలోలు చొప్పున సార్టెక్స్ ఫోర్టిఫైడ్ బియ్యమును ఉచితము గాను, ప్రతి కార్డుపై అర కిలో పంచదారను, అర కిలో ఒక్కింటికి 17 రూపాయల చొప్పున పంపిణీ చేస్తారన్నారు.

విద్యుత్ మోటార్లను అంటుకోవద్దు

ప్రజాశక్తి-చల్లపల్లి : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్తు మోటార్లను అంటుకోవద్దని విద్యుత్ శాఖ చల్లపల్లి మండల ఏఈ కే.అరవింద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాలులకు సర్వీసెస్ వైర్లు డామేజ్ అవుతాయని, స్తంభాలు పడిపోయి తీగలు తెగి ప్రమాదకర పరిస్థితి ఉంటుందన్నారు. రైతులు పొలాల్లో కరెంట్ మోటార్లు, స్టార్టర్స్ ముట్టుకొనే ప్రయత్నం గాని, దగ్గరకు వెళ్లే ప్రయత్నం గాని చేయవద్దన్నారు. ఎక్కడైనా, ఏదైనా విద్యుత్ సమస్య వుంటే, తీగలు తెగి ఉన్న పోల్స్ పడిపోతే వెంటనే మీ లోకల్ లైన్ ఇన్స్పెక్టర్స్, లైన్ మెన్, సబ్ స్టేషన్లకు కానీ, తమ దష్టికి కానీ, 1912కు కానీ తెలియచేయాలని సూచించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : గత రెండు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి. రైతు సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాలవల్ల జిల్లా వ్యాప్తంగా అనేక మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలు, డ్రెయిన్ లు పూడిక తీతలు తీయకపోవడమే పంటలు మునకకు కారణం అయ్యాయన్నారు.అప్పులు చేసి ఎంతో ఖర్చు పెట్టి పంటలు సాగు చేస్తున్న రైతులకు ఈ వర్షాలు ఎంతో నష్టాన్ని మిగిల్చియన్నారు. కాబట్టి ప్రభుత్వం,జిల్లా అధికార యంత్రాంగం పంట నష్టం వివరాలు సేకరించి నష్ట పోయిన రైతులందరికీ నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

3న జాబ్ మేళా

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ,జిల్లా ఉపాధి కల్పన శాఖ డిఆర్డిఎ – సీడాప్ సంయుక్త అద్వర్యంలో, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 3వ తేదీన మంగళవారం అవనిగడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పామర్రు నియోజకవర్గం కురుమద్దాలి లో గల రూరల్ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్లో "జాబ్ మేళా" నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు,మరియు ఎస్.శ్రీనివాసరావు, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి సంయుక్తంగా తెలియజేసారు. కావున ఆసక్తి మరియు తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా killuniverse.apssdc.in లింక్ నందు తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయ్యి, సదరు జాబ్ మేళాకు రెజ్యూమె లతో లేదా బయోడేటా ఫోరమ్ లతో పాటు ఆధార్ మరియు సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలన్నారు. మరిన్ని వివరాలకు 79955 34572 (అవనిగడ్డ), 80743 70846(కురుమద్దాలి) నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

సహాయక చర్యల్లో పాల్గొనాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-గన్నవరం : అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నందున గన్నవరం నియోజకవర్గంలోని అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు , తెలుగు యువత సహాయక చర్యల్లో పాల్గొనాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. విజయవాడ రూరల్ , ఉంగుటూరు , గన్నవరం , బాపులపాడు మండలాల్లో అనేక గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో పంట పొలాలు , రోడ్లు పూర్తి గా నీటమునిగాయి . ఈ మేరకు గన్నవరం నియోజక వర్గ వ్యాప్తంగా ఆయా మండలాల్లో పరిస్థితిని నేరుగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితుల తో మాట్లాడి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మతిచెందిన సంఘటన కత్తివెన్ను మండలం లక్ష్మీపురంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన సాన రాజు పశువుల కోసం గడ్డి కోస్తుండగా కరెంటు వైర్లు తెగి అతని మీద పడడంతో విద్యుత్ షాక్ తగిలి మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సవాలకు అనుమతులు తీసుకోవాలి : సిఐ

ప్రజాశక్తి- చల్లపల్లి : గణేష్ ఉత్సవాల కోసం ప్రతి చోట తిరిగి విసిగిపోకుండా పర్మిషన్లు అన్నింటిని ఒకే చోట లభించే విధంగా సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు మంజూరు చేస్తున్నట్లు చల్లపల్లి సిఐ కె ఈశ్వరరావు ఆదివారం తెలిపారు . సింగిల్ విండో సిస్టం ద్వారా గ్రామాలలో ఏర్పాటుచేసిన వినాయక చవితి మండపమునకు అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఈ గణేష్ ఉత్సవాల అనుమతి కోసం https:// ganeshutsav.net కు లాగిన్ అవ్వాలని లేదా 7995095800 నెంబర్‌కు హాయ్ అని వాట్సప్ మెసేజ్ చేయాలని సూచించారు. వెబ్సైట్ లేదా వాట్సప్ లింక్ నందు పూర్తి వివరాలు ఇచ్చి దరఖాస్తు ను పోలీస్, రెవిన్యూ, అగ్నిమాపక శాఖ, పంచాయతీ, కాలుష్య నియంత్రణ మండలి మరియు విద్యుత్ శాఖ అధికారులు స్వీకరించి, వెరిఫికేషన్ నిర్వహించి అనుమతులు (క్యూఆర్ కోడ్, ఎన్ఓసి) మంజూరు చేస్తారన్నారు.

3 నుండి 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లాలో సెప్టెంబర్ 3 వ తేదీ నుండి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ప్రారంభిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. పద్మావతి తెలిపారు.ఈ కార్యక్రమం లో భాగంగా వారానికి 2 రోజులు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు మరియు ప్రజా ప్రతినిధులతో గ్రామాలలో క్షేత్ర సందర్శన, చర్చ గోష్ఠి నిర్వహిస్తారన్నారు. ప్రతి మంగళ, బుధవారం రోజులలో ముందస్తుగా తయారుచేసిన షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాలను సందర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చేపట్టవలసిన, అనుసరించవలసిన మేలైన యాజమాన్య పద్ధతు లను ఆయా శాఖల అధికారులు రైతులకు తెలియజేస్తామన్నారు. అలాగే రైతులకు కావలసిన సాంకేతిక పరమైన సలహాలను అక్కడిక్కడే శాస్త్రవేత్తలు, అధికారులు తెలియజేస్తారన్నారు. కావున రైతు సోదరులు ఈ పొలం పిలుస్తోంది. కార్యక్రమంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలిపారు.

పలువురు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అంగలూరు బాలికల పాఠశాల క్రాఫ్ట్ టీచర్ చామర్తి కనకదుర్గ పద్మావతి పదవీ విరమణ కార్యక్రమాన్ని శనివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ 1 జి. జగన్మోహనరావు మాట్లాడుతూ క్రాఫ్ట్ టీచర్ గా 39 సంవత్స రాల పాటు పనిచేస్తూ విద్యార్థుల అభిమానాన్ని పొందారని అన్నారు. అంతేకాక ఆమె చేసిన అత్యుత్తమ సేవలకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకోవటం అభినందనీయమని అన్నారు. పద్మావతి దంపతులను పాఠశాల సిబ్బంది, ఉపాధ్యా యులు, స్నేహితులు, బంధువులు నూతన వస్త్రాలతో ఘనంగా సన్మానించారు.

అలాగే మండల తాసిల్దార్ టీ మల్లికార్జునరావు పదవీ విరమణ కార్యక్రమాన్ని పాల సీతలీకరణ కేంద్రంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి కష్ణవేణి, డిప్యూటీ తాసిల్దార్ కనకదుర్గ, ఆర్ ఐ షకీలా బేగం, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, చిరంజీవి, వీఆర్వోలు ప్రకాష్, వెంకన్న, భాస్కర్ రావు, రవి, రామస్వామి, పంచాయతీ కార్యదర్శులు సిహెచ్ ఉమామహేశ్వరరావు, నరసింహారావు, ఎలీషా రావు, రమేష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ మల్లికార్జునరావును సత్కరిస్తున్న దృశ్యం

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం తెల్లవారుజామున వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. కనకవల్లి గ్రామంలో టీడీపీ నాయకులు వీరంకి పరుశు రాం ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ చేశారు.**ప్రజాశక్తి-పమిడిముక్కల :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో పంపిణీ చేశామని ఎండిఒ విటల్ పాల్ అన్నారు. ఉదయం 6 గంటల నుండి పింఛన్ పంపిణీ చేశామన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఆముదాలపల్లి గోపాలకష్ణ, లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీ విజయవంతం అయిందని చల్లపల్లి వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు తెలిపారు. శనివారం ఉదయం చల్లపల్లిలో మండలంలోఅధికారులు, ప్రజా ప్రతినిధులు కలసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నబీఘోరీ, పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు, వీఆర్ఓలు బేబీ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు** ఉంగు టూరు మండలం పెద్దావుటపల్లి గ్రామంలో సెప్టెంబర్ నెల పించన్లు పంపిణీని గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు ఆరుమళ్ళ వెంకట కష్ణారెడ్డి ,ఆళ్ళ హానూక్, నాయకులు మున్నా, రామకష్ణ, కుందేటి చంద్రశేఖర్, కొండేటి వెంకటేశ్వరావు, కొండేటి కొండలు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** మోపిదేవి మండలంలోని కోసూరువారిపాలెం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరరావు శనివారం తెల్లవారుజామున పింఛన్ల పంపిణీ ప్రారంభించారు.

పెన్షన్ మా దగ్గరికి వచ్చి తీసుకోండి

మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామంలో పెన్షన్లు నేను చెప్పిన చోటకి వచ్చి తీసుకోవాలంటూ వద్ధులను వికలాంగులను సచివాలయ సిబ్బందితీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నెహ్రూపురం ఎస్సీ కాలనీ నాంచారమ్మ గుడి వెనక బడ్డీ కొట్టులోనే పెన్షన్ అందజేస్తాం, ఇష్టమైన వాళ్ళు వచ్చి తీసుకోండి కష్టమైన వాళ్ళు తీసుకోకండి అని తేల్చి చెప్తున్నారు. దీంతో ఎడతెరిపు లేకుండా కురుస్తున్న వర్షంలో నడిచి వెళ్లలేక వికలాంగులు వృద్ధులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కిడ్నీ రోగుల గుర్తింపు సర్వే

ప్రజాశక్తి - తిరువూరు : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన, డీఎం అండ్ హెచ్వో డాక్టర్ ఎం సుహాసినిల ఆదేశాల మేరకు తిరు వూరు మండలంలోని చౌటపల్లి, రాజు గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సమగ్ర కిడ్నీ రోగుల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నారు. చౌటపల్లి పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ఏ కనకదుర్గ భవాని, రాజు గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చలపతిరావుల పర్య వేక్షణలో వైద్య ఆరోగ్య సిబ్బంది మండలంలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ల పరిధిలోని గ్రామాల్లో కిడ్నీ బాధి తుల గుర్తింపు కోసం రక్త నమూనాలు సేకరిస్తున్నారు. హెల్త్ సూపర్వైజర్లు మధుసూదన్ రెడ్డి చంద్రమోహన్ పర్యవేక్షణలో హెల్త్ విజిటర్లు గ్రామ/ వార్డు హెల్త్ సెక్రటరీ లు, ఆశ వర్కర్లు సర్వేలో పాల్గొన్నారు.



శారద విద్యా సంస్థల ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నేటి సమాజానికి విలువలతో కూడిన విద్య అవసరమని, శారద విద్యా సంస్థలు చక్కటి విలువలతో కూడిన విద్యను అందిస్తుందని ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె.జి.వి.సరిత అన్నారు. మొగల్‌రాజపురంలోని శారద విద్యా సంస్థల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం నగరంలోని ఎ ప్లస్ కన్వెన్షన్‌లో జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులచే ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సరిత మాట్లాడుతూ పిల్లలకు కావాల్సిన సత్ప్రవర్తన, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, స్నేహం, గౌరవ మర్యాదలు, సహాయ సహకారాలు, సేవాదృక్పథం, లక్ష్యసాధన, సమాజంలో వారు ఎటువంటి స్థానంలో ఉండాలనే దాని గురించి విద్యా సంస్థల్లో నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ప్లానింగ్ కమీషన్ ఫార్మర్ వైస్ చైర్మన్ సి.హెచ్. కుటుంబరావు, ఉమెన్ వరల్డ్ చెస్ ఛాంపియన్ కోనేరు హంపి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా అవసరమని, శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో శారద విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్‌బాబు, జనరల్ మేనేజర్ జి.వి.రావు పలువురు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

తిరువూరు : తిరువూరు పట్టణంలోని పేదలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ శనివారం ప్రారంభించారు. పట్టణంలో 3,405 సామాజిక పెన్షన్లు ఉండగా సచివాలయం సిబ్బంది 91.1శాతం పంపిణీ చేసినట్లు నగర పంచా యతీ కమిషనర్ జి లోవరాజు తెలిపారు. **జగ్గయ్యపేట:** మండలంలోని చిల్లకల్లు గ్రామంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య శనివారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా పెన్షన్‌లను అందించారు. **వన్‌టౌన్ :** 50వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబు శనివారం పెన్షన్లు పంపిణీ చేశారు.

సిపిఎం నాయకుడి సతీమణి మృతి

ప్రజాశక్తి - వీరులపాడు : చెన్నారావు పాలెం గ్రామానికి చెందిన షేక్ కాసింబి అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందారు. చెన్నారప్పాలెం గ్రామానికి చెందిన నాయకులు షేక్ సైదా సతీమణి కాసింబి భర్తతోపాటు కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. కాశింబికి ఇద్దరూ కుమారులున్నారు. కాసింబి మృతికి సిపిఎం మండల కార్యదర్శి చాట్ల రవి, సిపిఐ నాయకులు ఉట్టి కొండ చంద్ర మోహన్ సంతాపం తెలిపారు. టిడిపి నాయకులు కోడెల కుటుంబరావు ఎర్రగుంట కృష్ణారావు సంతాపం తెలిపారు.

ముంపు నివారణపై చిత్తశుద్ధి ఏదీ ?

ప్రజాశక్తి - విజయవాడ : ప్రభుత్వాలు, అధికారులు చేసే తప్పిదాలు, మోసాలు కొన్ని సందర్భాల్లో నగర ప్రజలకు శాపంగా మారుతున్నాయి. దీని వల్ల ఆయా సందర్భాల్లో పలు ప్రాణాలు పోవడంతో పాటు ప్రజలు అనేక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. ప్రకృతి విపత్కర పరిస్థితులు, విలయతాండవాలు సంభవించి, ప్రజలు ప్రమాదాలు, చిక్కుల్లో చిక్కుకున్న సమయంలో ప్రభుత్వాలు, అధికారులు చేసే హడావుడి అంతా ఇంతా కాదు. అవి ముగిసిన తరువాత మరిచిపోవడం, కావాలని విస్మరించడం పాలకవర్గాలకు, అధికారులకు పరిపాటిగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న రికార్డు స్థాయి భారీ వర్షాలకు నగరం ముద్దయ్యి...జలదిగ్బంధనంలో చిక్కుకుంది. పలు లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. వీధులు, రోడ్లు, డ్రెయిన్లు ఏకమై మోకాళ్ల నీటిలో ఎక్కడ గుంటో...ఎక్కడ మెట్టో...తెలియని వైనం నెలకొన్నది. రోజుల తరబడి కురుస్తున్న వర్షాలకు నగరంలోని మొగల్రాజపురం ఏరియాలో కొండ చరియలు ఇరిగిపడి పలు గృహాలు నేలమట్టం కావడం, శిథిలాల కింద పడి నలుగురు మృత్యువాత పడ్డారు. వన్‌టౌన్ కొండ ప్రాంతంలో కూడా పలు గృహాలు దెబ్బతిన్నాయి. తృటిలో ప్రమాదాల నుంచి అక్కడి ప్రజలు బయటపడ్డారు. ఇదే విధంగా నగరంలో జనజీవనం స్తంభించింది. రాజకీయ,ఆర్థిక ఇతర పలుకుబడిని ఉపయోగిస్తూ ఎక్కడికక్కడ డ్రెయిన్ల ఆక్రమణలు, వాటిపై నిర్మాణాలు వెలవడం, శిథిలావస్థకు చేరిన డ్రెయినేజీ వ్యవస్థ నిర్వహణ అస్తవ్యస్తంగా, అరకొరగా తయారయ్యి, వర్షాలు కురిసిన ప్రతి సారి నగర ప్రజలకు నరకమే. ఇబ్బందులు...కష్టాలు తప్పడం లేదు. విజయవాడ నగరంలో 96 కిలోమీటర్ల పొడవున మేజర్ డ్రెయిన్లు, అలాగే 226 కిలోమీటర్ల పొడవున మీడియం డ్రెయిన్లు, మరో 1126 కిలోమీటర్ల పొడవున మైనర్ డ్రెయిన్లు, ఇవి కాకుండా గుంటతిప్ప



డ్రెయిన్ లాంటివి ఔట్‌ఫాల్ డ్రెయిన్ల నిర్వహణ సరిగా లేదు. విచిత్రం ఏమిటంటే...ఈ డ్రెయిన్లన్నీ చెత్త, ఇతర వ్యర్థాలు, ప్లాస్టిక్, తూటాకు, తదితర వాటితో పూర్తిగా నిండిపోయి, మురుగునీటి పారుదల ఎక్కడికక్కడ స్తంభించిపోయి డ్రెయిన్ల పైగా పొంగిపొర్లుతుంటాయి. వీటిల్లో డీసిల్టింగ్ పనులు ప్రతి ఏటా ప్రహసనంగా జరుగుతూ ఉంటుంది. ఈ పనికి కోట్లాది రూపాయలు ప్రజాధనం ఖర్చు చేస్తూ... ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేయించే డీసిల్టింగ్ పనులు జోరున వర్షాలు కురిసే సమయంలో ప్రారంభించడం, తూతూ మంత్రంగా చేయిస్తూ కాంట్రాక్టర్ల జేబులు నింపడమే విఎంసిలో పరిపాటిగా మారిందని చెప్పక తప్పదు. ఇది ఇలా ఉంటే...నగరానికి ఎంతో ముఖ్యమైన, ప్రాధాన్యత కల్గిన వర్షపు నీటి డ్రెయినేజీ వ్యవస్థ రూ.461 కోట్ల కేంద్ర ప్రభుత్వం నిధులతో 2017లో చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీ స్కీమ్ ఎనిమిదేళ్లు గడుస్తున్నా...నేటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయింది. ఈ స్కీమ్ ఎంతో ప్రాధాన్యతో...చివరకు ప్రభుత్వాలు చేసిన తీవ్ర నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం, తప్పిదం వల్ల ప్రస్తుతం ఈ స్కీమ్ పరిస్థితి నగర ప్రజలకు శాపంగా మారింది. ఆనాడు కేంద్రం నుంచి మంజూరు అయిన రూ.461 కోట్ల నిధుల్లో గత వైసిపి ప్రభుత్వం రూ. 282 కోట్లను వేరే స్కీమ్స్‌కు దారి మళ్లించి, ఈ పథకాన్ని చెత్తబుట్టలో వేసింది. గత రెండేళ్ల క్రితం నాటికే 40 శాతం లోపులోనే స్కీమ్ పనులు ఆయా డివిజన్లలో అరకొరగా జరిగాయి. (60 శాతం అధికారుల లెక్కల్లో). జరిగిన స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీ పనులు పూర్తికాకపోవడంతో... వీధుల్లో ఇళ్ల ముందు పలు రకాల ప్రమాదాలకు, చివరకు దోమలకు ఆవాసాలుగా తయారయ్యాయి. ఈ డ్రెయిన్ల మధ్య గ్యాప్‌లు వందల సంఖ్యలో ఉన్నాయి. వీటిని కూడా పూర్తి చేయకపోవడం, డివిజన్ల వారీగా పూర్తి స్థాయిలో డ్రెయిన్ల నిర్మాణ పనులు జరగకపోవడం...అటు వర్షపు నీరుకానీ, ఇటు ఇళ్లల్లో నుంచి వచ్చే వేస్ట్ వాటర్ సాఫీగా వెళ్లిపోవడానికి సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఈ పథకానికి సంబంధించిన నిధులను వెంటనే మంజూరు చేయించి, డ్రెయినేజీ వ్యవస్థను పూర్తి చేయించి, ముంపు నివారణ చర్యలు చేపట్టాలని నగర వాసులు కోరుతున్నారు.

- రాజు

లోతట్టు ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలి: నగర కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ : జోరున కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందిగా ఉన్న ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. ఈ మేరకు ఆయన అధికారులతో కలిసి మొగల్రాజపురం, ఇతర పలు లోతట్టు ప్రాంతాలను శనివారం పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లో, ప్రమాదం పొంచి ఉన్న ప్రదేశాలలో నివసిస్తున్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రదేశాలకు తరలించారు. రాణిగాతోటలోని 15, 16, 17, 18 డివిజన్స్‌తో పాటు, కొండ ప్రాంత ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు వాళ్ళని వెంటనే పునరావస కేంద్రాలకు అధికారులు తరలించి వారికి కావాల్సిన త్రాగునీటి భోజన సదుపాయాలు కల్పించారు. వర్షం నీటిలో చిక్కుకుపోయిన ప్రజలందరూ పునరావస కేంద్రాల్లో తరలిరావాలని, ప్రాణహాని లేని ప్రదేశాల్లో నివసిస్తున్న వారు బయటకు రాలేని పరిస్థితిలో ఉన్న వారికి ఇంటి వద్దనే తాగునీటి, భోజన సదుపాయం కల్పిస్తారని కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగరపాలక సంస్థ కంట్రోల్ రూమ్ సదుపాయం కల్పించారని ఇందులో సిబ్బంది 24 గంటలు పని చేస్తారని, నగర పౌరులకు ఎటువంటి సమస్య అయినా ఈ ఫోన్ నెంబర్లకు 0866-2424172,0866-2427485 ఫోన్ చేసి తెలుపవచ్చు అని,8181960909 ఈ నెంబర్‌కు వాట్సాప్ ద్వారా కూడా సమస్యను తెలుపవచ్చని, కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు.

బాధితులకు పునరావాసం కల్పించాలి...

దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం ఇవ్వాలి.:దోనేపూడి కాశీనాథ్

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరంలోని లోతట్టు ప్రాంతంలో ఇళ్లల్లోకి నీరు చేరిన బాధిత ప్రజలకు పునరావాసం కల్పించి, భోజనం, ఇతర సదుపాయాలు కల్పించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ కోరారు. ఈ మేరకు శనివారం పార్టీ నాయకులతో కలిసి సంఘటన జరిగిన ప్రాంతాల్లో పర్యటించి, పలు సహాయక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ రోజులుగా కురుస్తున్న అధిక వర్షానికి విజయవాడ నగరం పూర్తిగా నీట మునిగిందని అన్నారు. ఐదో డివిజన్ మొగల్రాజపురంలో కొండ చర్యలు విరిగిపడి మూడు ఇల్లు ధ్వంసం అయ్యాయని, ఈ దుర్ఘటనలో నలుగురు మతి చెందగా, మరొకరు శిథిలాల కింద ఉన్నారన్నారు. వీరితో పాటు మరో నలుగురు ప్రభుత్వ ఆసుపత్రికలో చికిత్స పొందుతున్నారన్నారు. విజయవాడ నగరంలో భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి అటు కొండ ప్రాంతాల్లోనూ ఇటు లోతట్టు ప్రాంతాల్లోనూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మొగల్రాజపురంలో ఈ దుర్ఘటనలో మరణించిన ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, క్షతగాత్రులకు ఒక్కొక్కరికి రూ.ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వమే పునర్నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాన్నారు. సిపిఎం బందాలు ఘటన స్థలాలలో సహాయక చర్యల్లో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో సిపిఎం తూర్పు సిటీ కార్యదర్శివర్గ సభ్యులు పుప్పాల కష్ణ, జి.క్రాంతి, నగర నాయకులు మురహరి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

బ్యారేజీకి పెరుగుతున్న వరద

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ ప్రకాశం బ్యారేజికి వరద పెరుగుతుంది. గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎగువ కృష్ణా నుంచే గాక కట్టలేరు, మున్నేరు, తదితర పాయల ద్వారా ప్రకాశం బ్యారేజికి ఎక్కువుగా వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ఇరిగేషన్ అధికారులు అధికంగా వస్తున్న వరద నీటిని దిగువకు మళ్లిస్తున్నారు.శనివారం సాయంత్రం 5 గంటల సమయానికి ఎగువ ప్రాంత నుంచి బ్యారేజికి ఎన్ ఫ్లో 3,42, 466 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. అదే విధంగా 3,40, 950 క్యూసెక్కుల వరద నీటిని బ్యారేజి 20 గేట్లను పూర్తి స్థాయిలో, మరో 50 గేట్లను ఎనిమిది అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు పంపిస్తున్నారు. మరో 1516 క్యూసెక్కుల నీటిని కెనాల్స్‌కు పంపిస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజి నీటి మట్టం 12 అడుగులుంది.

నేటి నుంచి నిత్యావసర సరుకులు పంపిణీ



ప్రజాశక్తి - విజయవాడ : ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సెప్టెంబర్ నెల నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఒకటో తేదీ ఆదివారం ఉదయం నుండి ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ నిధి మీనా అధికారులను ఆదేశించారు. చౌక ధరల దుకాణ డీలర్లు, ఎండియు ఆపరేటర్లుద్వారా సరుకుల పంపిణీని ప్రతిరోజు ఉదయం 7 గంటలకు నిర్దేసించిన ఎడ్యూల్ ప్రకారం బియ్యం, పంచదార మొదలైన నిత్యావసర సరుకుల పంపిణీకి సిద్ధంగా ఉండాలన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ ఆదివారం నుండి 17వ తేదీ వరకు కార్డుదారులకు ఇంటివద్దనే పంపిణీ చేయాలన్నారు. జిల్లాలోని రైస్ కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు. సరుకుల పంపిణీలో ఏమైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నెంబరు 1967 కు ఫోన్ చేయవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

అంకుర యాత్రపై సదస్సు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఇంటర్నేషనల్ స్టార్ట్-అప్ ఫౌండేషన్ తలపెట్టిన గ్రామీణ అంకురా యాత్ర ప్రారంభ సదస్సును శనివారం కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో నిర్వహించారు. సదస్సుకు స్కిల్ డెవలప్మెంట్ అండ్ స్టూడెంట్ ప్రోగ్రెషన్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో 30 సెప్టెంబర్ నుండి అక్టోబర్ 3, 2024 వరకు షెడ్యూల్ చేయబడిన గ్రామీణ అంకుర యాత్ర స్టార్టప్ వ్యవస్థాపకులు, పెట్టుబడిదారులు, సలహాదారులకు వినూత్న ప్రాజెక్ట్‌లను అనుసంధానం చేయడానికి, సహకరించడానికి ఇది ఒక ప్రత్యేక వేదికగా ఉపయో గపడుతుందని కేంద్ర గ్రామీణాభి వృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సదస్సుకు కెఎల్ యు అధ్యక్షులు కోనేరు సత్యన్నారాయణ,



ఐఎస్ఎఫ్ చైర్ పర్సన్ జెఎ.చౌదరిలతో పాటు ముఖ్య అతిథిగా హాజరయి ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ చేపట్టిన అంకుర యాత్ర కర్టెన్ రైజర్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కెఎల్ యు అధ్యక్షులు కోనేరు సత్యన్నారాయణ మాట్లాడుతూ అంకుర యాత్ర అనేది ప్రపంచంలోనే మొట్టమొదటి బస్సు యాత్ర అని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ చాన్సులర్ కోనేరు సత్యన్నారాయణ , వైస్ చాన్సులర్ జి పార్థసారథి వర్మ, ప్రో వైస్ ఛాన్సులర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖర రావు, డాక్టర్ వెంకట్రామ్, విద్యార్థి సంక్షేమ విభాగ ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్. ప్రసాద్ , అన్ని విభాగాల డీన్ లు, డైరెక్టర్ లు పాల్గొన్నారు.